

రాఘవేంద్రనగర్ కాలనీలో ఇండోర్ ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి

ఇండోర్ ఓపెన్ జిమ్ ప్రారంభం

హయత్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని రాఘవేంద్రనగర్ కాలనీలో జీహెచ్‌ఎంసీ నిధులతో నిర్మించిన ఇండోర్ ఓపెన్ జిమ్‌ను శనివారం ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి.. కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎక్కడా లేని విధంగా ఇండోర్ ఓపెన్ జిమ్‌ను హయత్‌నగర్‌లో మొదటి సారిగా ప్రారంభించినట్లు తెలిపారు. స్థానికంగానే వాకింగ్ ట్రాక్, ఇంకుడు గుంత నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలనీ సంక్షేమ సంఘం నాయకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ తిరుమల్‌రెడ్డి, నాయకులు శ్రీధర్‌గౌడ్, మల్లీశ్వర్‌రెడ్డి, మల్లేష్, కృష్ణారెడ్డి, కోట రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అనాథ విద్యార్థులకు చెక్కును అందిస్తున్న అమిత్‌రెడ్డి, హరివంశరెడ్డి

అనాథ విద్యార్థులకు గుత్తా విరాళం

ఎల్బీనగర్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎల్బీనగర్‌లోని అనాథ విద్యార్థి గృహానికి తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి రూ. 5 లక్షలు విరాళంగా అందజేశారు. త్వరలో విద్యార్థుల అవసరాలు తీర్చేందుకు తనవంతు సహాయం చేస్తానని ప్రకటించారు. శనివారం తన కుమారుడు గుత్తా హరివంశరెడ్డితో కలిసి అనాథ విద్యార్థి గృహానికి వచ్చిన అమిత్‌రెడ్డి రూ. 5 లక్షల చెక్కును విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాథ విద్యార్థులను చేరదీసి వారికి అత్యున్నత స్థాయిలో భోజన వసతి, విద్యా సౌకర్యాలు కల్పించి వారికి బంగారు భవిష్యత్తును అందిస్తున్న గృహ కమిటీని అభినందించారు. ఈ కార్యక్రమంలో అనాథ విద్యార్థి గృహ అధ్యక్షుడు మార్గం రాజేష్, అడ్వైజరీ బోర్డు చైర్మన్ శశిమోహన్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి మహాత్మ, జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల నిర్మూలనపై యువతకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ

యువత.. మత్తుకు బానిసలు కావద్దు: ఎస్‌ఐ

చంపాపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): నేటి యువత మత్తుకు బానిస కావద్దని ఎస్‌ఐ వెంకటరమణ అన్నారు. హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మిధాని బస్‌డిపో ఆవరణలో శనివారం మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ వెంకటరమణ మాట్లాడుతూ యువత స్వయం కృషితో ముందుకు సాగాలని, గంజా, జల్సాలకు అలవాటు పడి ఆరోగ్యాలను పాడుచేసుకోవద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించాలని సూచించారు.



సమావేశంలో కార్యవర్గాన్ని ప్రకటిస్తున్న వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

బీజేపీ పటిష్టతకు కృషిచేయాలి : వనిపల్లి

మన్సూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి అర్బన్ జిల్లాలో భారతీయ జనతాపార్టీని మరింత పటిష్టపరిచేందుకు నూతన కార్యవర్గ సభ్యులు పాటుపడాలని జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మన్సూరాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో జిల్లా పార్టీ నూతన కార్యవర్గాన్ని ఆయన ప్రకటించారు. బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ఉపాధ్యక్షులుగా రుద్రారం శంకర్, రాధాకృష్ణ యాదవ్, నందికొండ గీతారెడ్డి, రాజేంద్రప్రసాద్, మూల అనిల్‌గౌడ్, శ్రవంతి, ప్రధానకార్యదర్శులుగా బొల్లం యశ్పాల్‌గౌడ్, బండారి భాస్కర్, మహిపాల్‌రెడ్డి, కార్యదర్శులుగా మణిభూషణా చారి, నూతి శ్రీనివాసరావు, నరేష్‌యాదవ్, మాణిక్‌రావు, సుందర్ నారాయణ, దుర్గాప్రసాద్, కోశాధికారిగా కృష్ణంరాజు, కార్యాలయ కార్యదర్శిగా కందుల అమూల్యారెడ్డి, మీడియా కన్వీనర్‌గా నీల ఆనంద్‌కుమార్, ఐటీ ఇన్‌చార్జిగా బిందు ముత్తంగి నియమితులు కాగా వారికి శ్రీనివాస్‌రెడ్డి నియామక పత్రాలను అందజేశారు.



కలశాన్ని వేదికపై ఉంచి నినదిస్తున్న రవీంద్రనాథ్‌యాదవ్, సభ్యులు

ఆహిర్ రెజిమెంట్‌ను మళ్లీ అమల్లోకి తేవాలి

ఏఐవై మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌యాదవ్

మన్సూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశ సైన్యంలో అనేక కీలక యుద్ధాలలో తమ ధైర్యసాహసాలతో వీరోచితంగా పోరాడిన యాదవ సైనికులు ప్రాణాలను సైతం అర్పించారని అఖిల భారత యాదవ మహాసభ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్‌యాదవ్ అన్నారు. చరిత్రలో నిలిచేలా పోరాటాలు చేసిన యాదవ సైనికులను గుర్తిస్తూ 'ఆహిర్ (యాదవ) రెజిమెంట్'ను మళ్లీ పునరుద్ధరించాలని ఆయన కోరారు. మహాసభ ఎక్స్ సర్వీస్ సెల్ ఆధ్వర్యంలో ఈ నెల 9 నుంచి చేపట్టిన 'రేజంగ్లా రజ్ కలశ యాత్ర' శుక్రవారం రాత్రి హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా చింతల రవీంద్రనాథ్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం శుభం కన్వెన్షన్ సెంటర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ అలకాపురిలోని శ్రీకృష్ణుడి దేవాలయం వరకు కొనసాగింది. ఈ కార్యక్రమంలో చర్లపల్లి కార్పొరేటర్ బొంతు శ్రీదేవి, మాజీ కౌన్సిలర్ పోచబోయిన ఈశ్వరమ్మయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేంద్రనాథ్‌యాదవ్, పోచబోయిన గణేష్‌యాదవ్, తెలంగాణ యాదవ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అధ్యక్షుడు మన్నెబోయిన కృష్ణయాదవ్, ప్రధానకార్యదర్శి చోళ ఓంప్రకాశ్ యాదవ్, సైనిక సెల్ సభ్యులు జె.శ్రీనివాస్‌యాదవ్, సీవీ బాబు, ఆర్.కోటేష్‌యాదవ్, బి.శ్రీనివాస్‌యాదవ్, జి.సంతోష్‌యాదవ్, ఇతర పెద్దలు పాల్గొన్నారు.



ఎల్బీనగర్‌లో రాధాకృష్ణుల వేషధారణలో ఆకట్టుకున్న వివాన్, యశ్వి, యాషిక



ఎరుకల నాంచారమ్మ బస్తీలో కృష్ణాష్టమి వేడుకల్లో జక్కిడి రఘువీర్‌రెడ్డిని శాలువాతో సన్మానిస్తున్న సభ్యులు



నాదర్‌గుల్‌లోని శ్రీకృష్ణ దేవాలయంలో కృష్ణాష్టమి వేడుకల్లో బీజేపీ రాష్ట్ర నేత శ్రీరాములు యాదవ్

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా

- ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి

సరూర్‌నగర్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): 'గోకుల కృష్ణా గోపాలకృష్ణా'.. ఆటలు చాలయ్యా'.. వంటి పాటలతో శనివారం బడంగ్‌పేట్, మీర్‌పేట్ కార్పొరేషన్ల పరిధిలోని ఆలయాలు, పాఠశాలలు ఆధ్యాత్మిక వాతావరణంతో సందడిగా మారాయి. శ్రీకృష్ణజన్మాష్టమి సందర్భంగా పలు పాఠశాలల్లో చిన్నారులు చిన్ని కృష్ణుడు, సత్యభామ వేషధారణతో సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని అలరించారు. పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాదర్‌గుల్‌లోని శ్రీకృష్ణ దేవాలయం, జిల్లెలగూడలోని శ్రీబాలాజీ కోవెలలో నిర్వహించిన పూజల్లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములుయాదవ్ అర్చనలు చేశారు. బడంగ్‌పేట్‌లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించారు. స్కూల్ చిన్నారులు తమ వేషధారణతో సందడి చేశారు. జిల్లెలగూడలోని లార్డ్స్ టాలెంట్ హైస్కూల్ లోనూ జన్మాష్టమి వేడుకలు నిర్వహించారు.

కర్మన్‌ఘాట్‌లో...

చంపాపేట: హస్తినాపురం డివిజన్‌లలోని ఆయా కాలనీల ప్రజలు ఆలయాలలో కృష్ణాష్టమి భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ దేవస్థానంలోని బాన్సువారి కృష్ణమందిరం, వేణుగోపాలస్వామి ఆలయంలో భక్తులు శ్రీకృష్ణున్ని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎన్.లావణ్య, ఆలయ ధర్మకర్తలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీ కృష్ణుడిని తొట్టెలలో వేసి జోల పాడుతున్న భక్తులు

కవాడిపల్లిలో...

అబ్దుల్లాపూర్‌మెట్: అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కవాడిపల్లిలోని కోదండ రామచంద్ర స్వామి ఆలయంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. శ్రీ కృష్ణుడి డోలారోహణ నిర్వహించి, తొట్టెలలో కృష్ణుడిని వేసి జోల పాటలు పాడారు. పెద్ద సంఖ్యలో హాజరైన యువకులు ఉట్టి కొట్టేందుకు ఉత్సాహం చూపించారు. ఉట్టి కొట్టిన వారికి యాదవ సంఘం తరపున సన్మానించి నగదు ప్రోత్సాహంతో పాటు షీల్డ్‌ను అందజేశారు.



జిల్లెలగూడ లార్డ్స్ స్కూల్‌లో చిన్నారులు, సిబ్బంది



బడంగ్‌పేట్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో



కర్మన్‌ఘాట్ వేణుగోపాలస్వామి ఆలయంలో ఆలయ ఈవో లావణ్య

మన్సూరాబాద్‌లో...

మన్సూరాబాద్: మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని ఎరుకలనాంచారమ్మ బస్తీ డబుల్‌బెడ్రూమ్ అపార్ట్‌మెంట్స్ ప్రాంగణంలోని శ్రీ కృష్ణుడి దేవాలయంలో వేడుకలు నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ యువ నాయకుడు జక్కిడి రఘువీర్‌రెడ్డి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సభ్యులు రఘువీర్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు.



ఎల్బీనగర్‌లో.. చిన్ని కృష్ణుడి వేషధారణలో నిధీష్ సాయితేజ్

ప్రమాదానికి గురైన కారు.. దొరికిన గంజాయి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి నుంచి మహారాష్ట్రకు గంజాయిని తరలిస్తున్న కారు బాటసింగారం వద్ద ప్రమాదానికి గురైంది. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీ చేయగా కారులో 16.500 కిలోల గంజాయిని గుర్తించారు. వెంటనే వారు బూక్య మధుతో పాటు గంజాయి, షిఫ్ట్ కారు, ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మహబుబాబాద్ జిల్లా వస్త్రం తండాకు చెందిన బూక్య మధు కారు డ్రైవర్. ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్ ఖానాపూర్‌కు చెందిన సాదిబ్‌తో స్నేహం కుదిరింది. ఈ నెల 13న మధు సాదిబ్‌ను కలిసి రాజమండ్రిలోని గోకవరంలో గంజాయి ఉన్నదని చెప్పి దాన్ని తీసుకుచ్చేందుకు రూ.50 వేలు ఇచ్చాడు. దీంతో మధు షిఫ్ట్ కారులో గోకవరం వెళ్లి ఓ వ్యక్తికి రూ. 40 వేలను చెల్లించి గంజాయి తీసుకున్నాడు. రెండు సంచుల్లో 16 కిలోల గంజాయిని తీసుకుని మహారాష్ట్రకు బయలుదేరాడు. శుక్రవారం అర్ధరాత్రి కారు బాటసింగారం వద్దకు చేరుకోగానే ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొట్టింది. స్థానికుల సమాచారంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అదే సమయంలో మధు అనుమానస్పదంగా తచ్చాడుతుండగా అనుమానం వచ్చిన పోలీసులు కారులో తనిఖీ చేశారు. కారు రెండు సీట్ల మధ్యలో గంజాయిని గుర్తించారు. అతడిని అదుపులోకి తీసుకుని ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.





గంజాయి తరలిస్తున్న కారు, పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి



మహేష్‌కు నియామక పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ పవన్‌కుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామరంగారెడ్డి

'కొత్తపేట' ప్రధాన కార్యదర్శిగా మహేష్‌కుమార్

కొత్త పేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బీజేపీ కొత్తపేట డివిజన్ నూతన ప్రధాన కార్యదర్శిగా గట్టు మహేష్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం మోహన్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో డివిజన్ అధ్యక్షుడు మంచి రాజేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో బీజేపీ, మోర్చా డివిజన్ కమిటీ ఏర్పాటయింది. నూతన కమిటీ నియామక పత్రాలను పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇన్‌చార్జి సామరంగారెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్ అందజేశారు. కార్యదర్శులుగా జస్పాల్‌సింగ్, నవీన్, మధు, వలిగొండ స్వామి, స్వర్ణ, మోహన్‌రావు, కోటగిరి శ్రీనివాస్ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా సంగ్రామ్‌సింగ్ వ్యవహరిస్తారు. మహిళా మోర్చ అధ్యక్షురాలిగా మెరుగు వైజయంతి, ప్రధాన కార్యదర్శిగా పుష్ప, దళితమోర్చా అధ్యక్షుడిగా నర్సింగరావు నియమితులయ్యారు.

రంగారెడ్డి.. బీజేపీ కార్యదర్శిగా శ్రీనివాస్ రావు

వనస్థలిపురం, ఆగస్టు 16(ఆంధ్ర జ్యోతి): రంగారెడ్డి అర్బన్ జిల్లా బీజేపీ కార్యదర్శిగా వనస్థలిపురం డివిజన్ ఎఫ్‌సీఐ కాలనీకి చెందిన నూతి శ్రీనివాస్ రావు నియామకమయ్యారు. ఈ మేరకు శనివారం జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతి శ్రీనివాస రావు మాట్లాడుతూ బీజేపీ వనస్థలిపురం డివిజన్ అధ్యక్షుడిగా పార్టీ పటిష్టతకు కృషి చేసిన తనకు జిల్లా కార్యదర్శిగా నియమించడం హర్షణీయం అన్నారు.



ఉచిత వైద్యశిబిరంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యుడు

ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు తప్పనిసరి

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఏడాదికి ఒకసారి వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా కొన్నిరకాల వ్యాధుల ముప్పున పడకుండా ఉండవచ్చని డాక్టర్ యాదగిరి అన్నారు. శనివారం ఓల్డ్‌మలక్‌పేట మున్సిపల్ కాలనీలోని రాజాక్రిష్ణ క్లినిక్‌లో మ్యాన్‌కైండ్ ఫార్మా ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. కొలెస్ట్రాల్ లుపిడ్ ప్రొఫైల్, బీపీ, షుగర్, థైరాయిడ్, జ్వరం పరీక్షలు ఉచితంగా చేశారు.



సింగిరెడ్డికి నివాళులర్పిస్తున్న మాజీ కార్పొరేటర్ స్వర్ణలత, నేతలు

సింగిరెడ్డికి ఘన నివాళి

సైదాబాద్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ టీడీపీ మాజీ ఫ్లోర్‌లీడర్ స్వర్గీయ సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి వర్ధంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. సైదాబాద్ ప్రధాన రహదారి సమీపంలోని సింగిరెడ్డి విగ్రహానికి టీడీపీ, టీఆర్‌ఎస్ నేతలు, పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ స్వర్ణలత, శ్రవణ్ కుమార్, రవిశంకర్, సునీల్‌రెడ్డి, సంగీత, బర్ల శ్రవణ్ కుమార్, రవిందర్ గౌడ్, సందీప్, పగిల్ల శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్‌లోనే డెలివరీ



డెలివరీ అనంతరం తల్లీ బిడ్డలు

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పురిటినొప్పులు రావడంతో అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే గర్భిణి ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. కోహెడలో నివాసం ఉంటున్న చత్తీసగఢ్‌కు చెందిన పారుల్ 9 నెలల నిండు గర్భిణి. కాగా శనివారం ఆమెకు నొప్పులు రావడంతో 108కి ఫోన్ చేశారు. వెంటనే అక్కడికి చేరుకున్న అంబులెన్స్ ఆమెను హయత్‌నగర్ పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ఆమెను పరీక్షించిన వైద్యులు కోటి ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. దీంతో కోటికి వెళ్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువ కావడంతో సిబ్బంది ఎస్కే అంజద్ అంబులెన్స్‌లోనే డెలివరీ చేశారు. పారుల్ ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. ఆమెను వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా తల్లీ బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు తెలిపారు.

లారీ ఢీకొని ప్రయాణికుడి మృతి

అబ్దుల్లాపూర్‌మెట్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బస్సు టైరు పంక్చర్ కావడంతో రోడ్డు పక్కన వేచి ఉన్న ప్రయాణికుడిని లారీ ఢీకొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. అబ్దుల్లాపూర్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం అర్ధరాత్రి జరిగిన సంఘటన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా వైరా మండలం నేమలి గ్రామానికి చెందిన కమ్మపాటి కృపారక్షణ(32) కొంత కాలంగా కుటుంబ సభ్యులతో కలిసి జీడిమెట్లలో ఉంటున్నాడు. కాగా శుక్రవారం బస్సులో కుటుంబ సభ్యులతో కలిసి ఏపీలోని నూజివీడుకు వెళ్తున్నాడు. బస్సు నగర శివారు జాతీయ రహదారి బాటసింగారం వద్దకు చేరుకోగానే టైర్ పంక్చర్ కాగా డ్రైవర్ బస్సు దిగి టైర్ మార్చుతున్నాడు. ప్రయాణికుడు కృపారక్షణ బస్సు దిగి రోడ్డుపై నిల్చున్నాడు. అదే సమయంలో విజయవాడ వైపుకు వేగంగా వెళ్తున్న లారీ బస్సుతో పాటు అతడిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు పోలీసులు లారీ డ్రైవర్ వెంకట్‌ను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్రగాయాలు

చంపాపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): పుట్టిన రోజు ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. చత్రినాకకు చెందిన గృహిణి భార్గవి (33) బాలాపూర్‌లో తన స్నేహితురాలి కుమారుడి పుట్టినరోజు వేడుకలకు వెళ్లి శనివారం ఆదిబట్ల నుంచి ఫిసల్‌బండ బస్టాప్‌కు చేరుకుంది. బస్సు దిగే క్రమంలో ఆమె కింద పడింది. ఎడమకాలిపై నుంచి బస్సు టైరు వెళ్లడంతో ఆమె తీవ్ర గాయాలపాలయింది. కాలు నుజ్జునుజ్జు కావడంతో స్థానికులు 108లో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భర్త ఫిర్యాదు మేరకు డ్రైవర్ రమేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు కంచన్‌బాగ్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ కమల్‌కుమార్ తెలిపారు.

రోడ్డుమీద పశువులు

ఓల్డ్‌మలక్‌పేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మలక్‌పేట న్యూ మార్కెట్ మెట్రోస్టేషన్ దగ్గర శనివారం ప్రమాదకరంగా రోడ్డు మీదే పశువులు గుంపు పడుకుంది. అటువైపుగా వెలుతున్న కానిస్టేబుల్ గమనించి తన వాహనం పక్కకు ఆపి.. కొద్దిసేపు ట్రాఫిక్ నిలిపి వేశాడు.



ట్రాఫిక్ ఆపి పశువులను రోడ్డు దాటిస్తున్న పోలీస్

మహోన్నత వ్యక్తి వాజ్‌పేయి

మాజీ ప్రధాని అటల్‌జీ వర్ధంతి సందర్భంగా కొనియాడిన పలువురు నేతలు

మన్సూరాబాద్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): మహోన్నత వ్యక్తి మాజీ ప్రధాని, అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. వాజ్‌పేయి వర్ధంతిని పురస్కరించుకుని శనివారం మన్సూరాబాద్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో చైతన్యపురి కార్పొరేటర్ రంగ నర్సింహాగుప్తా, బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి బొల్లం యశ్పాల్‌గౌడ్, మహిళా మోర్చా రాష్ట్ర ప్రధానకార్యదర్శి నందికొండ గీతారెడ్డి, మన్సూరాబాద్, గడ్డిఅన్నారం డివిజన్ పార్టీల అధ్యక్షుడు మునగాల హరీష్‌రెడ్డి, దాసరి జయప్రకాశ్ పాల్గొన్నారు.
దేశాభివృద్ధిలో ప్రతిపక్ష నాయకుడిగా, మూడుసార్లు ప్రధానిగా కీలకపాత్రపోషించిన వాజ్‌పేయి రాజకీయ భీష్ముడని బీజేపీ ఎల్బీనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి అన్నారు. బీజేపీ అసెంబ్లీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాంపల్లి రామేశ్వర్, కృష్ణంరాజు, కృష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యాలయంలో వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న జిల్లా పార్టీ అధ్యక్షుడు వనిపల్లి శ్రీనివాస్‌రెడ్డి

కొత్తపేటలో...

కొత్త పేట: మాజీ ప్రధాని అటల్ బీహారీ వాజ్‌పేయికి బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మోహన్‌నగర్‌లోని కొత్తపేట డివిజన్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి కార్పొరేటర్ పవన్‌కుమార్, రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామరంగారెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో...

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్ వాజ్‌పేయి 7వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి హాజరై వాజ్‌పేయి చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు జాంజా నాయక్, పారంద మహేష్, గోవిందాచారి, జనార్దన్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.



వాజ్‌పేయికి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ కళ్లెం నవజీవన్‌రెడ్డి ఇతర బీజేపీ నేతలు

బాలాపూర్‌లో...

సరూర్‌నగర్ : దివంగత అటల్ బిహారీ వాజపేయి సమాజం మెచ్చిన ఆదర్శ నేత అని పలువురు బీజేపీ నాయకులు కొనియాడారు. బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్‌లో బీజేపీ రాష్ట్ర నాయకుడు కొలన్ శంకర్ రెడ్డి తదితరులు ఆయన ఫొటోకు పూలమాల వేసి నివాళులర్పించారు. మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని నందిహిల్స్‌లో బీజేపీ క్లస్టర్-1 అధ్యక్షుడు భిక్షపతిచారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కౌన్సిల్ మాజీ ఫ్లోర్ లీడర్ కీసరి గోవర్దన్‌రెడ్డి, ఇతర నేతలు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

చాదర్‌ఘాట్‌లో..

చాదర్‌ఘాట్‌లోని కృష్ణతులసినగర్ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కార్పొరేటర్ బొక్కా భాగ్యలక్ష్మి రెడ్డి, బీజేపీ నాయకులు దేవేందర్, యాదగిరి, తదితరులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు.

ఆంధ్రజ్యోతి
ఆంధ్రజ్యోతి ద్వారా జన్మదిన, వివాహ, షష్టిపూర్తి, పదవీ విరమణ, వ్యాపార, ఉద్యోగ, లీగల్ నోటీసులు, బహిరంగ ప్రకటనలు మరియు ఏ ఇతర ప్రకటనలైనా సంప్రదించండి
రాజు : 99854 02786